క్లుప్తంగా

సూపర్ సిక్స్ హామీలన్నీ అమలు చేయాలి



మాత భారతి, కాజులూరు ఎంపీపీ

కాజులూరు: కూటమి నాయకులు ఎన్నికలలో ప్రకటించిన సూపర్ సిక్స్ హామీలన్నీ తప్పకుండా అమలు చేయాలని ఎంపీపీ మాత భారతి డిమాండ్ చేశారు. గురువారం కాజులూరులో ఆమె మాట్లాడుతూ ఎన్నికల్లో సూపర్‌సిక్స్ పేరుతో తప్పుడు వాగ్దానాలు చేసి గద్దెనెక్కిన కూటమి నాయకులు వాటిని అమలు చేయకుండా అబద్ధాలు చెబుతూ ప్రజలను మభ్యపెట్టేందుకు ప్రయత్నిస్తున్నారన్నారు. తొలి ఏడాది పథకాలన్నీ పూర్తిగా ఎగ్గొట్టారని, రూ.15 వేలు చొప్పున ఇస్తామని చెప్పిన తల్లికి వందనం ఈ ఏడాది అరకొరగా కొంత మందికే ఇచ్చి చేతులు దులుపుకొన్నారన్నారు. ఆడబిడ్డ నిధి ఇవ్వాలంటే ఆంధ్రాని అమ్మాలంటూ ఆ పథకానికి పూర్తిగా మంగళం పాడేందుకు చూస్తున్నారన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు తీరు ప్రజలకు పూర్తిగా అర్థమయ్యిందని భవిష్యత్తులో ఆ పార్టీని ఏవ్వరూ నమ్మరన్నారు.

మెప్మా ఆర్పీలకు ట్యాబ్‌ల పంపిణీ



మున్సిపల్ కార్యాలయంలో ట్యాబ్‌లు అందుకున్న ఆర్పీలు

కపిలేశ్వరపురం (మండపేట): విధి నిర్వహణలో మరింత మెరుగ్గా ఉపకరించేందుకు మండపేటలోని మెప్మా ఆర్పీలకు గురువారం ట్యాబ్‌లను అందజేశారు. మున్సిపల్ కార్యాలయంలోని ఎమ్మెల్యే ఛాంబర్ నిర్వహించిన పంపిణీ కార్యక్రమంలో ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు, మున్సిపల్ చైర్‌పర్సన్ పతివాడ నూక దుర్గారాణి ఆర్పీలకు ట్యాబ్‌లను అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ చుండ్రు శ్రీవర ప్రకాష్, మున్సిపల్ కమిషనర్ టీవీ రంగారావు, మెప్మా సీఎంఎం సుజాత, సీఓ, ఆర్పీలు పాల్గొన్నారు.

భీమేశ్వరుని దర్శించుకున్న జడ్జి ఆనంది



ద్రాక్షారామ భీమేశ్వరాలయంలో జడ్జి ఆనంది

రామచంద్రపురం రూరల్: ద్రాక్షారామ మాణిక్యాంబా సమేత భీమేశ్వరస్వామిని కాకినాడ 3వ అదనపు జడ్జి జి.ఆనంది గురువారం దర్శించుకున్నారు. ఆలయ అర్చకులు, సిబ్బంది ఆమెకు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. జడ్జి భీమేశ్వరస్వామిని, మాణిక్యాంబా అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించుకున్నారు. అనంతరం బేడా మండపంలో ఆమెకు వేద పండితులు వేదాశీర్వచనం అందజేశారు.

అలీ అక్బర్‌కు ఘన నివాళి



అలీ అక్బర్ గుమ్మటం ఊరేగిస్తున్న ముస్లింలు

రామచంద్రపురం రూరల్: మొహర్రం సంతాప దినాల్లో భాగంగా కర్బలా పుణ్యభూమిలో అసువులు బాసిన ఇమామ్ హుస్సేన్ రెండో కుమారుడు అలీ అక్బర్ సంతాప దినాన్ని గురువారం ద్రాక్షారామలో ముస్లింలు భక్తి శ్రద్ధలతో నిర్వహించారు.

శత్రువులతో వీరోచితంగా పోరాడి చివరకు బల్లెం ఛాతీలో గుచ్చుకుని వీర మరణం పొందిన ఘటనను మత గురువు మౌలానా తనీర్ అబ్బాస్ వివరించారు. అలీ అక్బర్ పంజాలో ఉదయం నుంచి మజ్లిస్‌లు జరిగాయి. సాయంత్రం ఇమామ్ హుస్సేన్ పంజా నుంచి అలీ అక్బర్ తాబూత్(గుమ్మటం) మాతంతో ఊరేగింపు నిర్వహించారు. దూర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులకు అంజుమనే అలీ అక్బర్ కమిటీ ఆధ్వర్యంలో ఆగావారి పెద్ద పంజాలో భోజన ఏర్పాట్లు చేశారు.

నేడు ప్రభుత్వ ఐటీఐలో కౌన్సెలింగ్

రాయవరం: కాకినాడ ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణా సంస్థలో 2025–26 సంవత్సరానికి రెండో విడత ప్రవేశానికి నిర్వహించిన కౌన్సెలింగ్‌లో బీసీ–ఇ కేటగిరీలో మిగిలిన సీట్ల భర్తీకి శుక్రవారం కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్టు ప్రిన్సిపాల్, కాకినాడ జిల్లా అడ్మిషన్ కన్వీనర్ ఎం.వేణుగోపాల్ వర్మ తెలిపారు. రెండో విడత కౌన్సెలింగ్‌లో సీట్లు రాని బీసీ–ఇ కేటగిరిలో ఆసక్తి గల అభ్యర్థులు ఈ నెల 25వ తేదీ ఉదయం 8.30 గంటలకు ఒరిజినల్ సర్టిఫికెట్స్‌తో కౌన్సెలింగ్‌కు హాజరుకావాలని వారు తెలిపారు.

రైతుకు భారం

- పంట బీమాకు స్పందన కరవు
- బీమా ప్రీమియం చెల్లించని ప్రభుత్వం
- అయోమయంలో అన్నదాతలు



పంట పొలంలో నాట్లు వేసిన దృశ్యం

కె.గంగవరం: వ్యవసాయంలో అన్నదాతకు అడుగడుగునా అవాంతరాలే ఎదురవుతున్నాయి. వాటిని అధిగమిస్తూ, కష్టనష్టాలను భరిస్తూ ముందుకు సాగుతున్నారు. విత్తనం దొరక్క, ఎరువులు కొరత, పెట్టుబడి భారం, సాగునీటి కష్టాలు, ప్రకృతి వైపరీత్యాలు తదితర వాటిని నుంచి ఎన్నో కష్టాలను చూస్తున్నారు. చివరికి ప్రభుత్వం కూడా సాయం అందించడంలేదు.

పంట బీమాను చెల్లించకపోవడంతో అయోమయంలో పడ్డారు. గత వైఎస్సార్ ప్రభుత్వంలో రైతులకు అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్నదాతలకు ఎంతో అండగా నిలిచారు. పంట సాగు నుంచి చేతికి సొమ్ము వచ్చే వరకు జగనన్న తోడుగా నిలిచి రైతు రాజ్యాన్ని స్థాపించారు. పంట బీమా ప్రీమియం రైతుల నుంచి ఒక్క రూపాయి మాత్రమే తీసుకున్నారు. దీంతో ఆ ఐదేళ్లు రైతులకు పూర్తి భరోసా లభించింది. కానీ ప్రస్తుత కూటమి ప్రభుత్వం రైతులను మోసం చేసే దిశగా పాలన సాగిస్తుందని రైతులు ఆవేదన చెందుతున్నారు. కనీసం పంట బీమా ప్రీమియం కూడా చెల్లించడంలేదు. ఆ భారాన్ని రైతులపైనే మోపింది. దీంతో రైతులు కొంత మంది మాత్రమే బీమా సొమ్ములు చెల్లించారు. మిగిలిన వారు కట్టలేక ఇబ్బంది పడుతున్నారు.

నియోజకవర్గంలో...

రామచంద్రపురం నియోజకవర్గంలో కె.గంగవరం మండలంలో 4200 హెక్టార్లు, కాజులూరు మండలంలో 4500 హెక్టార్లు, రామచంద్రపురం మండలంలో 5046 హెక్టార్లలో వరి సాగు చేస్తున్నారు. ఎన్నికల సమయంలో కూటమి ప్రభుత్వం అన్నదాత సుఖీభవ పథకం కింద రైతులకు పెట్టుబడి సాయం అందిస్తామని చెప్పింది. తీరా అధికారంలోనికి వచ్చిన తరువాత దాని ఊసే మరిచింది. అలాగే పంట బీమా పథకాన్ని రైతులే కట్టుకోవాలని ఉత్తర్వులు జారీ చేశారు. గత ప్రభుత్వంలో ఉచితంగా పంట బీమా పొంది రైతులందరూ చంద్రబాబు తీరుతో గగ్గోలు పెడుతున్నారు. అసలే పెట్టుబడి సాయం లేక ఇబ్బంది పడుతుంటే ఇక బీమా ప్రీమియం ఎలా కట్టాలి అంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

స్పందన కరవు

కె.గంగవరం మండలంలోని 26 గ్రామాలకు గాను కేవలం 10 శాతం మంది రైతులు మాత్రమే ప్రీమియం కట్టారు. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో రైతులు పంటల బీమా చెల్లించినా నష్టం జరిగిన ఏ నాడూ పరిహారం దక్కిన పరిస్థితులు లేవు. ఇక ఇప్పుడు కూడా అలాంటి పరిస్థితే ఉంటుందని రైతులు భావిస్తున్నారు. దీంతో ఎక్కువ మంది రైతులు గడువు పొడిగించి నప్పటికీ వారి నుంచి స్పందన కరువైంది.

ప్రభుత్వమే చెల్లించాలి



పంట బీమా ప్రీమియం ప్రభుత్వమే చెల్లించాలి. గత ప్రభుత్వంలో బీమా ప్రీమియం ప్రభుత్వమే చెల్లించింది. పంట నష్టం జరిగిన ఆ ఏడాదిలోనే పరిహారం కూడా అందించింది. కానీ కూటమి ప్రభుత్వం రైతులకు ప్రీమియం భారాన్ని మోపింది. అన్నదాన సుఖీభావ సొమ్ము గత ఏడాది ఇవ్వలేదు. ఈ ఏడాది పంట ప్రారంభమైనా ఇంకా సొమ్ములు అందించలేదు.

– పండు గోవిందరాజు, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్

అవగాహన కల్పిస్తున్నాం



పంట బీమా ప్రీమియం గురించి రైతులకు అవగాహన కల్పిస్తున్నాం. అన్ని గ్రామాల్లో వ్యవసాయ శాఖ సిబ్బంది ద్వారా రైతులకు సమాచారం అందిస్తున్నాం. ఆయా గ్రామాల్లో బీమాపై అవగాహన సదస్సులు కూడా ఏర్పాటు చేస్తున్నారు. ఇప్పటి వరకు మండలంలో 200 ఎకరాలకు చెందిన రైతులు మాత్రమే బీమా ప్రీమియం చెల్లించారు.

– సద్గురు మూర్తి, ఏఓ, కె.గంగవరం

మహాలక్ష్మి అమ్మవారికి సారె సమర్పణ



అమ్మవారికి సారె అందజేసిన భక్తులు

రామచంద్రపురం రూరల్: హసన్‌బాదలో ఉన్న మహాలక్ష్మి అమ్మవారికి మహిళలు ఆషాఢం సారె సమర్పించారు. ఆలయానికి స్వీట్లు, పండ్లు, పువ్వులు, పసుపు, కుంకుమ అందజేయడంతో అమ్మవారిని శాకంబరిగా అలంకరించారు. అనంతరం ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ నాగిరెడ్డి సతీష్‌రావు, చేనేత నాయకుడు దొంతంశెట్టి సత్యప్రకాశ్, పలువురు గ్రామ పెద్దలు, అధిక సంఖ్యలో మహిళా భక్తులు పాల్గొన్నారు.

ప్రమాదాల నివారణకు ముందస్తు చర్యలు తీసుకోవాలి

ఆర్డీవో అఖిల



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీవో అఖిల

రామచంద్రపురం: రెవెన్యూ డివిజన్ పరిధిలో ఉన్న ప్రమాదకర పరిశ్రమల్లో ఎప్పటికప్పుడు మాక్ డ్రిల్ నిర్వహించాలని, ప్రమాదాల నివారణకు ముందస్తు చర్యలు తీసుకోవాలని ఆర్డీవో దేవరకొండ అఖిల పరిశ్రమల యాజమాన్యాల సంబంధిత అధికారులకు సూచించారు. స్థానిక రెవెన్యూ డివిజన్ కార్యాలయంలో గురువారం సంక్షోభ నివారణ కమిటీ లోకల్ క్రైసిస్ గ్రూప్ సమావేశం ఆర్డీవో అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఆర్డీవో అఖిల మాట్లాడుతూ పరిశ్రమల సమీపంలో ఉంటున్న ప్రజలకు ఆయా పరిశ్రమల్లో సంభవించే ప్రమాదాలపై పూర్తి అవగాహనతో ఉండాలన్నారు. ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ (కాకినాడ) కే రాంబాబు మాట్లాడుతూ ప్రమాదకర కర్మాగారాలలో తీసుకోవల్సిన భద్రతా ప్రమాణాలు, ఈ కమిటీ ఆవశ్యకతపై అవగాహన కల్పించారు. ఎంపీడీఓ లు, అగ్నిమాపక అధికారులు, మెడికల్ సిబ్బంది, పంచాయతీరాజ్ సిబ్బంది, ఇతర కమిటీ సభ్యులు, డివిజన్ పరిధిలో పరిశ్రమ ప్రతినిధులు పాల్గొన్నారు.

సచివాలయ ఉద్యోగులకు సత్కారం



ఉద్యోగులను సత్కరించిన ప్రజాప్రతినిధులు, గ్రామ పెద్దలు

రామచంద్రపురం రూరల్: అన్నాయిపేటలో బదిలీపై వెళుతున్న సచివాలయ ఉద్యోగులకు ప్రజాప్రతినిధులు, గ్రామ పెద్దలు గురువారం దుశ్శాలువాలతో ఘనంగా సత్కరించారు. గ్రామ సర్పంచ్ పెమ్మిరెడ్డి నాగేశ్వరరావు(దొరబాబు) ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో సర్పంచ్ దొరబాబు, వైఎస్ ఎంపీపీ శాకా చంద్రశేఖరసూర్యప్రకాశ్(బాబీ), ఉప సర్పంచ్ సలాది బుజ్జి తదితరులు మాట్లాడుతూ సచివాలయ ఉద్యోగుల గత ప్రభుత్వ కాలం నుంచి ఇప్పటి వరకు అందించిన సేవలకు కృతజ్ఞతలు తెలుపుతున్నామన్నారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు రావూరి సుబ్బారావు, ఆకేటి భీమన్న, పంచాయతీ పాలకవర్గ సభ్యులు పాల్గొన్నారు.

కాటన్ సేవలు అజరామరం

కపిలేశ్వరపురం (మండపేట): సర్ ఆర్థర్ కాటన్ సేవలు అజరామరం అని పలువురు వక్తలు అన్నారు. నియోజకవర్గంలోని మండపేట, రాయవరం, కపిలేశ్వరపురం మండలాల్లో గురువారం ఆయన వర్ధంతిని నిర్వహించారు. మండపేట మండలం పాలతోడు గ్రామం కాలువ బల్లకట్టు వద్ద ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ప్రభుత్వ గ్రామీణ వైద్యురాలు జెస్సీ, ఏఎన్ఎం ప్రియాంక, ఆశా కార్యకర్తలు శేషారత్నం, మేరీ, గ్రామనీటి సంఘం అధ్యక్షుడు నాగేశ్వరరావు, పీసీఎస్ చైర్మన్ వల్లూరి వీరవెంకట సత్యనారాయణ, మాజీ సర్పంచ్ పిల్లా పద్మ, అన్నందేవుల వెంకటరావు పాల్గొన్నారు.

కపిలేశ్వరపురం మండలంలో..

మండలంలోని అంగర, తాతపూడి, వల్లూరు తదితర గ్రామాల్లోని కాటన్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయా గ్రామాల ప్రజాప్రతినిధులు, నాయకులు హాజరయ్యారు. నాయకులు మాట్లాడుతూ, చదువు ప్రపంచ జ్ఞానాన్ని పెంచుతుందనడానికి కాటన్ గొప్ప ఉదాహరణ అన్నారు.

శాకంబరిగా రావులమ్మ



గంగలకుర్రులో రావులమ్మకు సమర్పించిన సారె

అంబాజీపేట: గంగలకుర్రు గ్రామ దేవత రావులమ్మ అమ్మవారు శాకంబరిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఆషాఢమాసం సందర్భంగా గురువారం అమ్మవారికి సారె సమర్పించారు. అమ్మవారికి బూరెలు, గారెలు, అరిసెలు, పులిహోర, పెసర పప్పు, చలివిడి, దద్దోజనంతో పాటు లడ్డు, కాజా, పాయసం తదితర సుమారు 200 రకాల పిండి వంటలతో కూడిన సారె సమర్పించారు. సుమారు 200 కేజీలతో వివిధ రకాల కూరగాయలతో అమ్మవారికి అలంకరించారు. అమ్మవారి ఆలయానికి భక్తులు ర్యాలీగా తరలివెళ్లారు.

ఉన్నత పాఠశాలకు కంప్యూటర్ల వితరణ



కంప్యూటర్లు అందిస్తున్న దాత నారాయణప్ప

మలికిపురం: రామరాజులంక జెడ్పీ ఉన్నత పాఠశాలకు గ్రామానికి చెందిన రిటైర్డ్ ప్రావిడెంట్ ఫండ్ కమిషనర్ మేడిచర్ల నారాయణప్ప రూ.ఒక లక్ష విలువైన కంప్యూటర్లను విరాళంగా అందించారు. బుధవారం పాఠశాలలలో ఈ మేరకు అందించారు. ప్రధానోపాధ్యాయిని కాశిబట్ల వెంకట రామ సుబ్బలక్ష్మికి అందించారు. కార్యక్రమంలో పాఠశాల పేరెంట్స్ కమిటీ చైర్మన్ రావూరి రాజా రమేష్ పాల్గొని మాట్లాడుతూ దాతల ఔదార్యాన్ని అభినందించారు.

కార్యక్రమలో ఉపాధ్యాయులు బేతినీడి శ్రీనివాస్, యేపుగంటి వెంకట పద్మనాభం, కూర్మా గణేష్ పాల్గొన్నారు.

బాధితుడికి ఆర్థిక సాయం



బాధితుడి తండ్రికి చెక్కును అందజేస్తున్న కాశీ అన్నపూర్ణాదేవి సేవా సంస్థ సభ్యులు

రావులపాలెం: అనారోగ్యంతో బాధపడుతున్న బాధితుడికి స్థానిక కాశీ అన్నపూర్ణాదేవి సేవా సంస్థ సభ్యులు గురువారం రూ.13 వేలు ఆర్థిక సాయం అందజేశారు. అంబాజీపేట మండలం వక్కలంక గ్రామానికి చెందిన పితాని ఆనంద నాగబాబుకి వెన్నెముకకు నరానికి మధ్యలో కణితి రావడం వలన నాలుగు సంవత్సరాలుగా లేవలేని పరిస్థితులో ఉన్నారు. తల్లి మృతి చెందడంతో తండ్రి ఒక్కరే నాగబాబు యోగక్షేమాలు చూసుకుంటున్నారు. అయితే తండ్రికి వృద్ధాప్యం కారణంగా ఏ పనికి వెళ్లలేని పరిస్థితి. ఆర్థిక సహాయం కోసం కాశీ అన్నపూర్ణా దేవి సేవా సంస్థ సభ్యులను సాయం కోరారు. రావులపాలెంలో నాగబాబు తండ్రి పితాని వెంకటేశ్వర రావుకి సంస్థ సభ్యుల చేతుల మీదుగా రూ.13 వేలు చెక్కును అందజేశారు.

హస్త కళలపై అవగాహన

మామిడికుదురు: పాశర్లపూడిలంక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థినిలకు హస్త కళలపై మూడు రోజుల ఉచిత అవగాహన సదస్సు గురువారం ప్రారంభమైంది. దీనిలో భాగంగా పలు రకాల కళాత్మక బొమ్మల తయారీపై విద్యార్థినులకు అవగాహన కల్పిస్తున్నారు. దీనిలో భాగంగా స్టాల్ ఏర్పాటు చేశారు. స్కూల్ హెచ్ఎం ఎస్.రాధ అధ్యక్షతన జరిగిన సభలో గ్రామ సర్పంచ్ తెలగారెడ్డి సూర్యప్రకాశరావు మాట్లాడుతూ చక్కటి సదావకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఇటువంటి అవగాహన తరగతులు జరగడం ముదావహమన్నారు. విద్యార్థి దశలో ఈ తరహా కార్యక్రమాల నిర్వహణ ద్వారా ఎంతో మేలు జరుగుతుందని చెప్పారు.

నేడు పీఠంలో పూజలు

రాయవరం: మండలంలోని వెదురుపాక విజయదుర్గా పీఠంలో శ్రావణమాసం తొలి శుక్రవారం పూజలు నిర్వహించనున్నారు. ఈ విషయాన్ని పీఠం అడ్మినిస్ట్రేటర్ వీవీ బాపిరాజు గురువారం తెలిపారు. విజయదుర్గా అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి, వివిధ రకాల ద్రవ్యాలతో అభిషేకాలు, పూజలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చే భక్తులు సామూహిక కుంకుమ పూజలు నిర్వహించుకోనున్నారని, అందుకు అవసరమైన ఏర్పాట్లు చేసినట్లు ఆయన తెలిపారు.

కాలిబాటలతో ప్రయోజనాలెన్నో..

- వరి చేలల్లో కాలిబాటలతో అధిక లాభం
- రైతులకు సూచనలిస్తున్న వ్యవసాయాధికారులు



మొసలపల్లిలో కాలి బాటలతో వరి నాట్లు వేసిన రైతులు

అంబాజీపేట: ఖరీఫ్ పనులు ముమ్మరంగా సాగుతున్నారు. రైతులు పనుల్లో బిజీబిజీగా ఉన్నారు. పంటను కాపాడుకునే విధానాన్ని వ్యవసాయాధికారులు రైతులకు సూచిస్తున్నారు. వరి చేను ఊడ్చిన తరువాత పాలంలో ప్రతి రెండు మీటర్లకు కాలిబాట వేయడం వలన రైతులకు అధిక ప్రయోజనం ఉంటుంది. పైరు వేరు భాగానికి విస్తారంగా గాలి, సూర్యరశ్మి తగలడం, చీడ, పీడల సమస్య తగ్గడం, ఎరువులు, పురుగు మందులు చల్లే సమయంలో దారి సమస్య తగ్గడంతోపాటు ప్రతి ఎకరాకు మూడు, నాలుగు బస్తాలు అదనంగా పండి రైతులకు లాభాన్ని ఆర్జించవచ్చు.

రైతుల్లో ఆసక్తి

గతంలో చాలా మంది రైతులు కాలిబాటలు వేయడం అదనపు ఖర్చుగా భావించేవారు. దీనిపై ఆసక్తి చూపించేవారు కాదు. వ్యవసాయాధికారులు కాలిబాటల ప్రయోజనాన్ని రైతులకు విస్తృతంగా వివరించడంతో రైతులంతా కాలిబాటలు వేస్తున్నారు. మూడు నియోజకవర్గాలకు సంబంధించి పి.గన్నవరంలో 25,382, కొత్తపేటలో 34,706, రాజోలులో 8,650 ఎకరాల్లో వరి సాగు చేయనున్నారు. కాలిబాటలు వేసే సమయంలో రైతులు సరైన యాజమాన్య పద్ధతులు పాటించాలి. ప్లాస్టిక్ లేదా డొక్కతాడు తీసుకుని నేను గట్టు అవతలి వైపు నుంచి ఇవతలి వైపు వరకు బాగా సాగదీసి కట్టాలి. తాడు వెంబడి 12 సెంటీమీటర్లు వెడల్పున వరి నాట్లు సాగులో ఉన్న వరిచేను తొలగించి పక్కనే పలుచగా ఉన్న ప్రదేశంలో నాటుకోవాలి. వెదజల్లే పద్ధతిలో సాగు చేస్తే విత్తనాలు చల్లిన తరువాత 15 నుంచి 20 రోజుల వ్యవధిలో కాలిబాటలు వేసుకోవాలి.

లాభాలెన్నో..

కాలిబాట వేయడంతో వేరు మొదళ్లకు గాలి, వెలుతురు, సూర్యరశ్మి విస్తారంగా తగులుతుంది. దీంతో పైరు ఆరోగ్యంగా ఎదుగుతుంది. చీడపీడల బెడద కొంతవరకు తగ్గుతుంది. కాలిబాట మార్గంలో వెళ్లి కలుపు తొలగించడానికి, మందులు చల్లడానికి వీలు కలుగుతుంది. తెగుళ్లను సులభంగా గుర్తించడానికి, సస్యరక్షణ చర్యలు తీసుకోవడానికి ఎలుకలను నివారణకు వీలవుతుంది. తుపానులు, భారీ వర్షాలు వంటి ప్రకృతి విపత్తులు ఏర్పడిన సమయంలో పైరులో కిరణజన్య సంయోగ క్రియ సమర్థవంతంగా జరిగి దిగుబడి తగ్గకుండా ఉంటుంది. పైరులో చీడ పీడల ఉధృతిని దగ్గరగా గమనించి, దానికి అనుగుణంగా సకాలంలో సస్యరక్షణ చర్యలు తీసుకోవడానికి వీలవుతుంది.

కాలిబాటలతో అధిక దిగుబడులు



ఒక ఎకరం పొలంలో కాలిబాటలు వేయడానికి సుమారు రూ.800 ఖర్చు అవుతుంది. కాని కాలిబాటలు వేయడం వల్ల నాలుగు బస్తాల వరకు అధిక దిగుబడి రావడమే కాకుండా పంట కాలంలో చేను మొత్తం తిరగడానికి అనువుగా ఉంటుంది. దీనిపై మా సిబ్బందితో రైతులకు అవగాహన కల్పించడంతో ఇప్పుడు రైతులంతా కాలిబాటలు వేస్తున్నారు.

– కె.ధర్మప్రసాద్, మండల వ్యవసాయాధికారి, అంబాజీపేట

చిన్నారులకు వైద్య పరీక్షలు

కపిలేశ్వరపురం: అంగర పీహెచ్‌సీ పరిధిలోని పలు అంగన్వాడీ, ప్రభుత్వ పాఠశాలల్లోని చిన్నారులకు వైద్య పరీక్షలు చేశారు. ప్రభుత్వ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు పీహెచ్‌సీ వైద్యాధికారి పీఎస్ఎస్‌డి రత్నకుమారి పర్యవేక్షణలో రాష్ట్రీయ బాల స్వస్థ కార్యక్రమంలో భాగంగా ఒకటి నుంచి పదో తరగతి చదువుతున్న విద్యార్థులకు ఆరోగ్య పరీక్షలు చేశారు. విద్యార్థుల బరువు, ఎత్తు, బీపీ, వినికిడి, దృష్టి సామర్థ్యం తదితర అంశాలపై విద్యార్థులను పరీక్షించారు. ఈ కార్యక్రమంలో ఎంపీహెచ్ఎస్ ఎం.నానిబాబు, ఎంఎల్‌హెచ్‌పీ, వైద్య ఆరోగ్య, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాకు నేడు అంతరాయం

కె.గంగవరం: స్థానిక సబ్‌స్టేషన్ పరిధిలో నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని రామచంద్రపురం డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కె.రత్నాలరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. సబ్ స్టేషన్ పరిధిలో పాడైపోయిన ఎల్‌వీ బ్రేకర్ తొలగించి కొత్త బ్రేకర్ ఏర్పాటు చేయడం వల్ల కె.గంగవరం, సత్యవాడ, తామరపల్లి, కుందూరు గ్రామాలకు ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని తెలిపారు.

రాయవరం: మండలంలోని పసలపూడి విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని రామచంద్రపురం ఈపీడీసీఎల్ డీఈఈ కె.రత్నాలరావు తెలిపారు. సబ్‌స్టేషన్‌లో మరమ్మతులు, సబ్‌స్టేషన్ పరిధిలో విద్యుత్ లైన్ల మరమ్మతుల నిమిత్తం పసలపూడి రూరల్, ఇండస్ట్రియల్ ఫీడర్ పరిధిలో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందన్నారు. ఉదయం ఎనిమిది నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు పసలపూడి, చెల్లూరు గ్రామాల పరిధిలో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని ఆయన తెలిపారు.

రెండు రోజులు కుళాయి నీరు వాడొద్దు

కపిలేశ్వరపురం (మండపేట): పట్టణంలోని బురుగుండ చెరువు సమీపంలో ఉన్న 3.25 గ్యాలెన్ల నీటి సరఫరా సామర్థ్యం గల వాటర్ ట్యాంక్ డోమ్ పునర్నిర్మాణ పనులు పూర్తయ్యాయి. జూన్ మొదటి వారంలో ట్యాంక్ డోమ్ కుప్పకూలడంతో పట్టణానికి ట్యాంక్ ద్వారా తాగునీటి సరఫరా నిలిచిపోయింది. ప్రత్యామ్నాయంగా పైప్‌లైన్లకు మోటార్లను అమర్చి తాగునీరును సరఫరా చేస్తున్నారు. కాగా, డోమ్ పునర్నిర్మాణ పనులు పూర్తి కావడంతో రేపటి నుంచి ట్యాంకులోకి నీరును తోడనున్నారు. తోడిన నీటితో రెండు రోజులపాటు ట్యాంక్‌ని శుభ్రం చేయనున్నందున ఈనెల 26, 27 తేదీల్లో రెండు రోజులపాటు కుళాయి ద్వారా వచ్చే నీటిని ప్రజలు వాడొద్దని మున్సిపల్ కమిషనర్ టీవీ రంగారావు తెలిపారు. ఆపై సరఫరా చేసే నీటిని పట్టణ వాసులు సురక్షితంగా వాడొచ్చని తెలిపారు. కాగా గురువారం ట్యాంక్‌ను మున్సిపల్ డీఈ శ్రీనివాస్, ఏఈ పవన్ పరిశీలించారు.

మాజీ సర్పంచ్ శేషారత్నం మృతి



కాజులూరు: కుయ్యేరు మాజీ సర్పంచ్ మాగాపు శేషారత్నం(68) మృతి చెందారు. బుధవారం రాత్రి అకస్మాత్తుగా గుండెపోటు రావడంతో కుటుంబ సభ్యులు ఆసుపత్రికి తరలించగా చికిత్సపొందుతూ మృతి చెందారు. 2002 నుంచి 2007 వరకూ శేషారత్నం గ్రామ సర్పంచ్‌గా పనిచేశారు. ఆమెకు భర్త, ముగ్గురు కుమార్తేలు ఉన్నారు. వైఎస్సార్ సీపీ మండల పార్టీ అధ్యక్షుడు, స్థానిక గ్రామ సర్పంచ్ పిల్లి కృష్ణమూర్తి శేషారత్నం భౌతికకాయాన్ని సందర్శించి శ్రద్ధాంజలి ఘటించగా, రాష్ట్ర మంత్రి వాసంశెట్టి సుభాష్, ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు కుటుంబీకులను ఫోన్‌లో పరామర్శించి సానుభూతి వ్యక్తం చేశారు.

శలపాక సర్పంచ్ గనిరాజుకు పితృ వియోగం

కాజులూరు: శలపాక గ్రామ సర్పంచ్ పోతుల గనిరాజు పితృ వియోగంతో బాధపడుతున్నారు. ఆయన తండ్రి పోతుల శ్రీరాములు(70) గురువారం అకాలమరణం చెందారు. శ్రీరాములుకు ముగ్గురు కుమారులు, ఇద్దరు కుమార్తెలు. కాగా ఆయన భార్య ఐదు సంవత్సరాల క్రితం మృతి చెందడంతో గనిరాజు వద్దే ఉంటున్నారు. ఏడుపదుల వయస్సులోనూ వ్యవసాయం పనులు చేసుకుంటూ నిత్యం ఉత్సాహంగా అందరిని పలకరించే శ్రీరాములు మరణం గ్రామస్తులను ఎంతగానో కలసివేసింది. తణుకువాడ పీఏసీఎస్ మాజీ వైస్ చైర్మన్ తాడి వెంకటరెడ్డి, స్థానిక మాజీ సర్పంచ్ పోతురాజు బీమారావు తదితరులు శ్రీరాములు భౌతిక కాయానికి శ్రద్ధాంజలి ఘటించి గనిరాజు కుటుంబీకులకు ధైర్యం చెప్పారు.

భవిత కేంద్రాన్ని సందర్శించిన ఏపీసీ

మామిడికుదురు: నగరంలో భవిత కేంద్రాన్ని సమగ్ర శిక్ష అడిషనల్ ప్రాజెక్టు కో–ఆర్డినేటర్ జి.మమ్మీ, సీఎంఓ బీవీవీ సుబ్రహ్మణ్యం గురువారం సందర్శించారు. విద్యార్థులతో కొద్దిసేపు ముచ్చటించారు. వారికి భవిత కేంద్రంలో అందుతున్న సదుపాయాలను తెలుసుకున్నారు. ప్రభుత్వం ఉచితంగా అందించిన కిట్లు సక్రమంగా అందాయా లేదా అన్న అంశాన్ని పరిశీలించారు. భవిత కేంద్రంలోని విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. భవిత కేంద్రాల్లోని విద్యార్థులు సులభంగా ఆకలింపు చేసుకునేలా బోధన చేయాలన్నారు. వారి వెంట ఎంఈఓ మోకా వెంకన్నబాబు, ఐఈఆర్పీలు కె.సుశీల, ఎస్.బిందు ఉన్నారు.

పాము కాటుకు వివాహిత మృతి

ముమ్మిడివరం: నగర పంచాయతీ శివారు రాజుపాలెం గ్రామానికి చెందిన యనమదల ప్రవల్లిక (27) పాము కాటుకు గురై మృతి చెందింది. గురువారం ఉదయం రాజుపాలెం గ్రామ ప్రధాన రహదారిపై వాకింగ్ చేస్తుండగా పాము కాటు వేసింది. అపస్మారక స్థితిలో ఉన్న ఆమెను ముమ్మిడివరం ప్రభుత్వాసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. ఈ మేరకు ఎస్సై డి.జ్వాలాసాగర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.